# కొత్త ఇల్లు

"ఏమిటి పార్వతీ! ఏం చేస్తున్నావ్?"

ఐదునిముషాలుగా వంటగది గుమ్మం దగ్గర నిల్చుని తదేకంగా చూస్తున్నాడు విశ్వం. చేటలో బియ్యంలోని బెడ్డలు ఏరు తోందనుకున్నాడు. కానీ ఆ పనికాదు. ఆమె చెయ్యటం. బియ్యం మీద ఓ పెద్దసున్నా చుట్టింది వేలితో ఆ సున్నాలో అడ్డుగీతలూ, నిలువుగీతలూ, చిన్న చిన్న గళ్ళులా వేస్తోంది. తనఉనికికూడా గమనించ లేనంతగా తదేకంగా దృష్టి సారించి వుందా గళ్ళమీద! ఇక ఉండబట్టలేక అడిగేశాడు.

త్రుళ్ళిపడి తలెత్తిచూచింది పార్వతి. భర్త అడిగిన ప్రశ్నేమిటో, అతగాడు ఎప్పుడు ఆఫీసునుంచి ఇంటికి వచ్చాడో బోధపడలేదు.

"నువ్వేదో బొమ్మలు గీస్తావని........ఆఫ్ కోర్స్ .... అవి ఫలానా బొమ్మలని తెలీదనుకో ........ మన పెళ్ళికి ముందు....మీ అన్నయ్య నాతో అన్నాడనుకో....ఐనా ఇలా చేటలో బియ్యం మీద చిత్రలేఖనం చేస్తావని నాకు తెలీదు.... ఇంతకూ అది అమూర్త శిల్పమా? ఐమీన్ మోడరన ఆర్టా?" నవ్వుతున్న అతగాడి కళ్ళలో కొంటెతనం ప్రతిఫలిస్తోంది. ఆ సుదీర్ఘమైన విమర్శకు మరో సమయంలో అయితే చాలా ఘాటైన సమాధానమే చెప్పివుండేది. కానీ,

షుమారు ఓ ఇరవై నిముషాలుగా చేటలో బియ్యం మీద వ్రేళ్ళతో వేస్తున్న ప్లాన్ తాలూకు ఆలోచనలతో బుర్రంతా బరువుగా వుంది. స్టౌ మీద గిన్నెలోని ఎసరు మరుగుతున్నందుకు నిదర్శనంగా గిన్నెమీది మూత ఎగిరెగిరి పడుతోంది.

'ఎసట్లోబియ్యంవేసి మీకు కాఫీఇస్తాను కూర్చోండి,' అంది మాట మారుస్తూ, అక్కణ్ణుంచిలేచి

"ఇంతకూ ఆ చిత్రకళ ఏమిటో చెప్పావు కావు." పీట వాల్చుకు కూర్చుని మళ్ళీ మొదటికొచ్చాడు విశ్వం.

"ఊహుఁ ఆ సంగతి ఇప్పుడు కాదు"

"మరెప్పుడు ? ముహూర్తం చూడాలా?"

"మీకు వినే ఓపికా, నాకు చెప్పేతీరికా వున్నప్పుడు చెబుతాను. ఊఁ కాఫీ తాగేసెయ్యండి!"

ఇక ఇప్పుడు పార్వతి ఏమీ చెప్పదని తెలుసు విశ్వానికి. మాట్లాడకుండా కాఫీతాగి తన గదిలోకి వెళ్ళిపోయాడు

కానీ ఆరోజే కాదు, వరుసగా ఆ తర్వాత తరచూ ఎప్పుడు చూచినా, పార్వతి చేతివ్రేళ్ళు, నేలమీదో, గోడమీదో, పరుపుమీదో, పీటమీదో, భోజనంచేస్తూ చేస్తూ కంచంలోనో, చివరకు గాలిలోనైనాసరే సున్నాలు చుట్టడం గళ్ళువేయటం, చెరిపివేయటం, స్క్వేర్‌లు చిత్రించటం చుక్కలు పెట్టడం, చెరిపివేయటం లాంటివి విశ్వం చూస్తూనే ఉన్నాడు. అలాటి సమయాలలో పార్వతి ఎంత పరధ్యా

న్నంగా వుంటుందో కూడా తెలుసుకున్నాడు. వరండా మెట్లెక్కి వస్తుండగానే, వంట ఇంట్లో మూలగా వున్న పార్వతికి తన పదధ్వని వినిపించేది. నడకను బట్టి మనిషిని పోల్చుకొని, "వచ్చారు కదూ! ఒక్క క్షణంలో కాఫీ తెస్తున్నా నుండండి!" అంటూ ఎదురొచ్చేది. ఏ కొత్త వూహ బుర్ర లోకి వచ్చినా, దానిని తనకు వినిపించేవరకూ తహతహ లాడి పోయేది అలాటి పార్వతి అస్తమానం పరాకుగా వుంటోంది ఆమె వెనకగా వచ్చి నిల్చున్నా, గమనించలేనంతటి స్తబ్దుగా తయారయింది. ఈ సున్నాల, ఈ స్క్వేర్‌ల చిత్రాల, గళ్ళ రహస్యమేమిటి ?

"కొంపదీసి కుటుంబ నియంత్రణం తాలూకు అడ్వర్ టైజ్ మెంటు కోసం, ఏదేనా కొత్త మోడల్ చిత్రించటం లేదు కదా నువ్వు?'' అన్నం తింటూతింటూ మధ్యలో, కంచంలో వరుసగా ఆరు చుక్కలు పెట్టి, ఆ ఆరింటినీ కలుపుతూ ఏదో డిజైన్ వేలితో వేస్తున్న పార్వతి వేపు విస్మయంగా చూస్తూ అడిగాడు విశ్వం.

"ఊహూఁ! భోజనం కానీండి."

సినిమాకని బయల్దేరా రిద్దరూ

"సరదాగా నడిచే వెడదాం. కొత్తగా ఇళ్ళు కడుతున్న కాలనీ ముందుగా వెడదాం. చాలా అందంగా వున్నాయట కదూ ఆ ఇళ్ళు?'' అంది పార్వతి రిక్షా మాట్లాడ బోతున్న విశ్వాన్ని వారిస్తూ.

విశ్వం విస్మయంగా చూశాడు. సరదాగా ఎప్పుడేనా అలా నడిచి వెడదాం రమ్మంటే "వద్దు బాబూ! అన్నిజతల

కళ్లూ నా కేసే చూస్తున్నట్లూ .... ఏదోగా వుంటుంది నాకు రిక్షాలో పోదాం !'' అనే పార్వతేనా ఈ మాటలనటం ?

కొత్తగా ఇళ్ల కడుతున్న ఆ కాలనీలో ఇళ్ళన్నీ ఒక్కొటి ఒక్కో ఫ్యాషన్‌లో అందంగా వున్నాయి. పార్వతి చాలా మెల్లగా నడుస్తోంది. ఒక్కో ఇల్లునూ, కాంపౌండ్ వాల్ నూ, తరచి తరచి చూస్తోంది. ఒక్కోసారి బాగా వెనక పడుతోంది నడవటంలో.

"ఇలా అయితే ఇక ఈ రోజు సినిమా హాల్‌కు చేరం పార్వతీ ! కాకున్నా అసలు సిటీనిగానీ, సిటీలో ఇళ్ళనుగానీ ఎప్పుడూ చూడని పెర్రిబాగుల దానిలా ఏమిటా కళ్ళప్ప గించి చూడటం?" చిరాకు పడ్డాడు విశ్వం.

"చూడండి ఆ వెనక ఇల్లు అంతా బావుంది. కానీ వరండా ముందు ఆ వంపేమిటి ? ఈ ఇంటి కాంపౌండ్ వాల్ మరీ సింపిల్‌గా ఏబ్రాసిఅనంగా వుంది. అదో, ఆ కొత్త బంగళా బొత్తుగా పురానా మహల్‌లా వుంది కదూ?" సినిమా హాల్లో కూర్చున్నాక కూడా పార్వతి ధోరణి అలాగే వుంది విశ్వం నుదురుచిట్లించాడు. "పార్వతీ ! మనం ఆ ఇళ్ళలో వుండబోవటంలేదు....ఆ ఇళ్ళు మనస్వంత డబ్బుతో కట్టబడుతున్నవి కాదు....ఇక ఇళ్ళ వూసెత్తకు...."

ఆ రాత్రి పడుకోబోతూ హఠాత్తుగా అడిగింది పార్వతి 'మందారమాల' అనే పేరు బావుంటుందంటారా ? పోనీ 'తామరకొలను' కాదూ అంటే 'విశ్వశాంతి?'

దోమతెర సరిచేసుకుంటున్న విశ్వం అదిరిపడ్డాడు. దోమ తెరలోనుంచి కొద్దిగా ముఖం బయటకు పెట్టి .... "ఎవరికి ? ఎవరికా పేర్లు ? అసలా పేర్లేమిటి ? కొంపదీసి నువ్వుగాని....?"

అతగాడి కళ్ళలోని సందేహాలు పసిగట్టిన పార్వతి ఫక్కున నవ్వింది .... "ఏం భయంలేదు లెండి .... అదేం కాదు ...అసలా పేర్లలో మీకేది నచ్చింది?"

"ఏదీ నచ్చలేదు ఇంతకూ పక్కింటి వెంకాయమ్మ మనవరాలికా? ఎదురింటి బుజ్జబ్బాయిగారి మనవడికా ఆ పేర్ల సెలెక్షన్ ? నాతో అంటే అన్నావుగానీ, ఎవరితోను అనకు నవ్విపోతారు వూంకే పోరు, నిన్ను 'కీల్పాక్' లో చేర్చమని సలహా ఇచ్చి మరీ పోతారు,"

పార్వతి చిన్నబుచ్చుకుంది "ఊహూం నాకు 'మందారమాల' గానీ, 'విశ్వశాంతి' గాని కావాలి! ఆ పేర్లే బావున్నాయి"

"సరే, మరో ఐదేళ్ళు పోయాక మనకు పుట్టబోయే అబ్బాయిపేరు, 'మందార మాలారావు' అనీ, ఆ తర్వాత మరో ఐదేళ్ళకు పుట్టబోయే అమ్మాయి పేరు 'తామర' అనో. 'కొలనుకుమారి' అనో పెడదాం .... హఠాత్తుగా విశ్వం గొంతులో ఆర్ద్రత ధ్వనించింది "పార్వతీ ! నీకేమైందో నా కర్థం కావటంలేదు. నీ వాలకం చూస్తుంటే, ఏదేనా భయంకరమైన దృశ్యం చూసో, సంఘటనను గురించి చదివో నీ బుర్ర షాక్ తినలేదు కదా అనిపిస్తోంది .... ఎన్నడూ

లేంది .... నువ్వు ప్రతిరోజూ పూజ చేస్తున్నావేమిటి ? నేను పది రోజులుగా గమనిస్తున్నాను .... వంట ఇంటి అలమారులో పెద్ద ఎత్తున దేవుళ్ళు వెలశారు .... అందరి ఫోటోలమీదా కుంకుమ, అక్షతలూ ... బాప్ రే ! ఏ గ్రహం ఆవేశించింది నీలో?''

జాలిగా భర్తవేపు చూచి, ప్రేమగా అతగాడి క్రాఫ్ సరిచేసింది పార్వతి .... ''మీ రూరికే కంగారు పడకండి, ఏమీ కాలేదు నాకు. దేవుడి దయవుంటే అన్నీ వస్తాయి''

''ఏమిటా వచ్చేవి ?''

''ఏవైనా !''

మరోనాడు ఆఫీసుకు వెళ్ళబోతూ, పది రూపాయల నోటుకు చిల్లరలేక, గబగబా పార్వతి పెట్టె తీశాడు విశ్వం. సాధారణంగా పార్వతి దగ్గర చిల్లరేవుంటుంది. చిల్లర పోగు చెయ్యటం పార్వతికి హాబీ ! అలా పోగుచేసిన చిల్లరతో ఓ ఓవల్టిన్ టిన్ నిండిపోయిందోసారి.

''ఇంత చిల్లరెందుకు పార్వతీ !'' అని తనడిగితే, ''మీకు తెలీదు ప్రతి చిన్న వస్తువుకూ ఏదో ఓ నోటు మార్చాలంటే నాకు చేతులాడవు ...'' అంటుండేగానీ, ప్రతి చిన్న వస్తువుకూ నోట్లుమార్చి చిల్లరగా మారుస్తూనే వుంటుంది ! చివరకోసారి, పాలవాడి కివ్వాల్సిన డబ్బుకు, నోట్లు లేక ముప్పైఅరు రూపాయల చిల్లర వాడి తుండు గుడ్డలో పోసింది ! ఆలోచిస్తూ చిల్లరడబ్బా తీసిన విశ్వం కళ్ళు, క్షణకాలం అక్కడే నిలిచిపోయాయి .... తెల్లని కవ

రులో జాగత్తగా మడిచి పెట్టివున్న లాటరీ టిక్కెట్లు! ఒకటీ రెండూ కాదు. పాతిక ! .... ఒక్కో రాష్ట్రంలోగల రక రకాల్ల లాటరీల తాలూకు టిక్కెట్లు !

"మైగాడ్!" తనను తాను నమ్మలేనట్లు గుండెమీద చెయ్యి వేసుకున్నాడు విశ్వం!

లాటరీ టిక్కెట్లు ! పూజలు !

"పార్వతీ ! నీకు పిచ్చిపట్టింది ! నిజంగా పట్టింది!" తనలో తను గొణుక్కుంటున్నట్లు అనుకున్నాడు .... కవరు క్రిందనే ఉల్లిపొర పేపర్లో చుట్టివున్న ఓపెద్ద డ్రాయింగ్ పేపరు కనిపించింది.

"ఇంకా ఏంచేసిందో?" అనుకుంటూనే డ్రాయింగ్ పేపరు విప్పిచూశాడు విశ్వం. ఏదో పెద్ద బంగళాప్లాన్ ! "ఒక అంగుళం ఈజీక్వల్‌టు ఒక అంకణం" అని వ్రాసివుంది ప్లాన్‌క్రింద, అవి నిస్సందేహంగా పార్వతి అక్షరాలే! గదులు, కారిడార్, కార్‌షెడ్, కాంపౌండ్‌వాల్, మేడమీదకు మెట్లు, బెడ్‌రూం, బాత్‌రూమ్స్, లావెట్రీస్....అన్నీ మార్కు చేసివున్నాయి !

"మీరు ఇంకా ఆఫీసుకు వెళ్ళలేదూ?" అంటూ వచ్చిన పార్వతి, క్షణకాలం ఎదురుగా నిలిచిన దృశ్యంచూచి మ్రాన్పడిపోయింది. ఓ ప్రశాంత సాయం సమయంలో తనే వివరాలన్నీ చెబుదా మనుకొంటోంది . . . . ఈలోగా విశ్వం వాటిని బయటకు తీశాడు! అతగాడి కళ్ళలో కోపం, అస హ్యాం, ఆశ్చర్యం అన్నీ మిళితమైవున్నాయి.

"....ఇదేమిటి ? ఈ టిక్కెట్లు? మొన్న దీపావళికి చీరె కొనక్కోమని ఇచ్చిన డబ్బుతో .... ఇవి కొన్నా వను కుంట్టాను ! సరే ఈప్లాన్ ఏమిటి?"

గబుక్కున భర్తదగ్గరగావచ్చి, అతగాడి భుజంమీాద తల ఆన్చి మెల్లిగా అంది పార్వతి. "ప్లీజ్ ? అలా కోపంగా చూడకండి .... నే నసలేమీా చెప్పలేను భయంతో .... " విశ్వానికి జాలి వేసింది....

"సర్లే ! ఇంతకూ ఇదంతా ఏమిటి ?" మృదుత్వా అరువు తెచ్చుకుంటూ అడిగాడు.

"అది మందారమాల !" మెల్లిగా అంది పార్వతి.

"అంటే?" ఆశ్చర్యంగా, అర్థంగాక అడిగాడు విశ్వం.

"ఆ బంగళాపేరు మందారమాల"

"ఎవరిదా బంగళా?"

"మనదే?"

"మనదా!"

"అవును. ఏ లాటరీలోనైనా సరే లక్షరూపాయలు వస్తే, ముందుగా 'మందారమాల' కట్టిస్తాను .... నా మనసు లోని వూహలకూ, నా అభిరుచులకూ తగ్గట్టు కట్టిస్తాను .... మనకి పాతఇల్లు ...ఎప్పుడో మీా తాతలనాడు కట్టిన ఇల్లు .... వసతిగాలేదు .... అధునాతన సౌకర్యాలు లేవు .... కదూ?, అతగాడేమంటాడోనని భయపడ్తూనే చెప్పింది పార్వతి ....

క్షణ కాలం నిర్ఘాంతపోయి, పార్వతి వేపు కొత్తవ్యక్తిని చూస్తున్నట్లు చూస్తూ అన్నాడు విశ్వం ... "పార్వతీ!"

పార్వతీ ! నువ్వేనా మాట్లాడుతున్నది ? ఈ గాలిమేడలు, ఈ వూహాగానాలు .... ఈ నేల విడిచిన సాము .... ఈ ప్రలోభం .... నీలోనే పుట్టాయా ? ఆ డబ్బు రావటం కోసమేనా పూజలు ? దేవుడిని నీ స్థాయికి దింపి, అతగాడికి వాటా పెడుతున్నావా నీ గాలిమేడలలో?'.

పార్వతి మాట్లాడలేదు. అడ్డొస్తే మరింతగా రెచ్చిపోతాడేమోనని మౌనంగా వుంద..

'... చదువూ, సంస్కారంవున్న నువ్వేనా ఇలా ప్రవర్తించటం? ఈ పాతిక టిక్కెట్లలో ఒక్కటీ రాకపోతే?"

గబుక్కున అతగాడి నోటికి సుతారంగా తన చేతి వ్రేళ్ళు అడ్డుగా పెట్టింది పార్వతి....

"అలా అనకండి .... అశుభం....ఈరోజు శుక్రవారం కూడాను....లక్ష్మీదేవికి పూజ చేస్తున్నాను...."

విశ్వం మ్రాన్పడిపోయాడు....

పార్వతి సంగతి అతగాడికి బాగా తెలుసు....ఆమె ఒక నిర్ణయం తీసుకుంటే మరి దానికి తిరుగులేదు....మౌనంగా తన నిర్ణయాన్ని అమలు జరుపుకుంటుంది...

"సరే... నీ యిష్టం....కానీ ...ఇది వ్యసనంగా మారితే మాత్రం నువ్వే నష్టపడతావు...." విసురుగా బయటకు వచ్చేశాడు విశ్వం.

పార్వతి నవ్వుకుంది. ఈ మగాళ్లెప్పుడూ ఇంతే! అతి వాస్తవంగా ఆలోచించి, అనవసరంగా భయపడుతుంటారు.

పాతిక టిక్కెట్లలో ఒక్క టేనా ప్రైజు గెలుచుకోదా ? పది లక్షలు కాకపోతే, ఒక్కలక్ష .... కనీసం ఒక్కలక్ష !

ఈ ఇల్లు తమ స్వంతందేకావచ్చు .... కానీ బొత్తుగా పురాతన పద్ధతిలో కట్టబడింది. బెడ్‌రూంలో మొరటుగా వుండే గచ్చునేల .... ముతకగోడలు .... బెడ్‌రూం ప్రక్కనే బాత్‌రూం వుండితీరాలని....ఆరోజుల్లోని పెద్దలకు ఏంతెలుసు? పోనీ హాలు? ఓతీరుగావుందా? ఆ పిచ్చి కిటికీలు! వంటిల్లు ? రామరామ ! ఓ డజనుమంది ఎక్కి కూర్చోవటానికి వీలుగా చుట్టూరా చెక్కల తలుపుల అలమరాలు !

దేవుడా! ఇలాంటి పిచ్చిఇంట్లో తను కాబట్టి కాపురం చేస్తోంది....

“మీకేమండీ స్వంత ఇల్లుంది. అద్దె కొంపల అగచాట్లులేవు !” అంటారు చాలామంది తమ ఫ్రెండ్స్ ! కానీ, పిచ్చిపిచ్చిగా వున్న ఈ కొంపలోకంటే తనకు అద్దె కొంపలోనే హాయి అనిపిస్తోంది. కొత్తఇల్లు .... కొత్తఫ్యాషన్.... ఆయనగారలానే చిందులుతొక్కనీ .... రేపు కొత్తఇల్లు కట్టించాక .... ‘మందారమాల’ అని నామకరణం చేశాక .... విశాలమైన బెడ్‌రూమ్స్, చక్కటి పెద్దహాలు, ముచ్చటైన డైనింగ్ హాల్, పెద్ద కిచన్ .... మేడమీద విశాలమైన గదులు .. చుట్టూరా కొత్తఫ్యాషన్‌లో కాంపౌండ్ వాల్.... చూచి, మురిసి మూర్ఛపోరూ ?

షుమారు మూడునెలలు పార్వతి అలాగే .... అలాగే తియ్యతియ్యటి ఆలోచనలలో తేలిపోతూనేవుంది. విశ్వం

మాత్రం కొత్తయిల్లు గురించి లేనిపోని కామెంట్స్ ఏమీ చెయ్యలేదు ... కానీ అప్పుడప్పుడూ వ్యంగ్యంగా .. "పోనీ పార్వతీ! మందారమాలకంటే, విశ్వశాంతే బావుంటుం దేమో ?" అనేవాడు.

పార్వతి కళ్లలో ఎరుపుజీరలు చూచి, "పోన్లే! నాకెం దుకు? కొత్తఇల్లు కట్టించేది నువ్వు .... నీ కే పేరు నచ్చితే అదే పెడదాం!" అనేస్తున్నాడు.

అన్ని లాటరీల ఫలితాలూ, అన్ని పేపర్లలో వరుసగా రావటం మొదలెట్టాయి. పరీక్షా ఫలితాలకంటే ఎక్కువ ఆసక్తితో, ఒక్కోటికెట్టు నంబరు చేతబట్టుక పేపరు చూస్తోంది పార్వతి.

నెలరోజులు గిర్రున తిరిగిపోయాయి ఆఖరు టిక్కెట్టు ఫలితంకూడా తేలిపోయింది.

ఒక్కోరోజు గడిచేకొద్దీ ఒక్కోరకంగా పార్వతిలో నిరాశ. నిస్పృహ హెచ్చిపోయాయి! చివరిరోజు ... ఇక ఆపుకోలేక భోరున ఏడ్చేసింది .. పెద్దజబ్బుచేసి, లంకణాలు చేసినద-నిలా అయిపోయింది!

అలా కుమిలికుమిలి పోతున్న పార్వతిని చూస్తున్నకొద్దీ విశ్వంలో జాలిముంచుకు వచ్చింది.

"పార్వతీ! బాధపడకు ... నేను ముందే చెప్పాను..." విశ్వం మాటలు పూర్తికాకముందే దెబ్బతిన్న కోడెత్రాచులా

లేచింది పార్వతి ... "మీ కిప్పుడు సంతోషంగా వుందా ? మీ మాటే నెగ్గిందని గర్వంగా వుందా? దుఃఖంతో ఆమె కంఠం గ్గాద్గదికమైపోయింది.

విశ్వం మృదువుగా ఆమె భుజం మీద చేతులు వేశాడు ... "పిచ్చిపార్వతీ ! ఇన్నేళ్ళ సహచర్యంతో ... నా గురించి నువ్వు తెలుసుకుంది ఇంతేనా?..."

పార్వతి మాట్లాడలేదు.

"ఈ లాటరీలూ ... ఇదో వ్యసనం పార్వతీ ! మరో సారి, మరోసారి ప్రైజు వస్తుందంటూ మనిషిని ప్రలోభ పెట్టేస్తాయి. జూదరి మనస్తత్వాన్ని పెంచుతాయి ... దాంతో పగటికలలు ఎక్కువై. కర్తవ్యం విస్మరిస్తాడు మనిషి .. నువ్వేచూడు .... ఈ మూడునెలలుగా నువ్వేదో వూహాలోకంలోనే బ్రతుకుతున్నావు ... ఆ రాబోయే డబ్బుతో. కట్టబోయే బంగళాలో కాలక్షేపం చేస్తున్నావు. అందుకు ఎన్ని బంగళాల ప్లానులు నీబుర్రలో మెదిలాయి ? గాలిలో కూడా నీచేతివ్రేళ్ళు ఇంటి నమూనానే తయారుచేస్తూ వున్నాయి. ఈవున్న ఇంటిమీద అసహ్యం కలుగజేస్తాయి, అలూలేదు, చూలూలేదన్నట్లు చేతిలో డబ్బు లేకున్నా, ఇంటిపేరు నిర్ణయించేస్థితికి వచ్చావు .... ఇంటి చుట్టూరా నాటే మొక్కలగురించి ఆలోచించావు .... అందుకోసం నీవు మరోమెట్టు దిగజారావు కాదూ?"

విశ్వం క్షణకాలం ఆగాడు. పార్వతి విస్ఫారిత నేత్రాలతో అతగాడివేపు చూస్తోంది .... మమతకు మించినదైవం,

మానవత్వాన్ని మించిన దైవత్వం, మానవసేవను మించిన పూజ మరొకటి లేదనేదానివి.... కానీ.... కానీ. డబ్బుకోసం.. డబ్బు రావాలనే కోర్కె కోసం .... నువ్వు పూజలు మొదలెట్టావు .... దేవుడికీ ఆశలు చూపావు .... మంత్రాలతో, స్తోత్రాలతో .... దేవుడాఅంటూ దేవిరిస్తున్నావు .... ఇంతకు మించిన ఆత్మవంచన .... ఇంతకు మించిన నైతికపతనం... మరోటుందా?''

''వద్దు .... వద్దు .... ఇంకా.... ఇంకా .... ఇంకేమీ చెప్పొద్దు!'' తనమీద తనకే రేగిన కోపంతో గట్టిగా అరిచింది పార్వతి.

''నో .... నో .... ఇంకేమీ చెప్పను....'' మృదువుగా అంటూ, పార్వతి చుట్టూరా చేతులు వేశాడు విశ్వం .... కొన్ని క్షణాలు గడిచాయి.

పార్వతీ .... ఇలా చూడు ....'' ఆమె చెవిదగ్గరగా అతగాడి మృదుమధుర కంఠస్వరం కువకువలాడింది.

పార్వతి మెల్లిగా తలెత్తి భర్త కళ్ళలోకి చూచింది. ఆమె అరమోడ్పు కన్నుల్లో . కొండంత సిగ్గు గూడుకట్టుకుని వుంది

''సిగ్గుపడకు .... సిగ్గుపడాల్సిందేమీలేదిందులో .... ఒక్కోసారి మనిషి కోర్కెలు ... మనిషినలా వెర్రితనంలోకి లాగివేస్తాయి .... చూడు పార్వతీ .... ఈ నా ఛాతీ ... నీ 'మందారమాల' కాదూ ? ఈ నా బాహుపరిధిలో నువ్వూహించుకొనే ఆ అందమయిన కొత్త ఇంటిలోని హాయిలేదూ?

నాకుమాత్రం .... నీ ఎదలో ఇలా తలదాచుకుంటే చాలు .... కోటి 'విశ్వశాంతులు' కనిపిస్తాయి ... కొన్ని కోట్ల' తామర కొలను' ఆ హాయి లభిస్తుంది .... కొన్ని వేల కొత్త ఇళ్లు కట్టిన ఆనందం పొందుతాను ....నాకీ నిండు ఇల్లు చాలు.... ఈ పాత ఇల్లు చాలు.."

ఆమె చేతులు అప్రయత్నంగా అతగాడి చుట్టూరా పెనవేసుకు పోయాయి ... ఇరువురి గుండెల్లోనూ మందార మాలలు వూగుతున్నాయి .... కోటి తామరలు విచ్చుకున్నాయి ... కోటానుకోట్ల శాంతికిరణాలు, కాంతికిరణాలలా వ్యాపించాయి.

("యువ" నవంబరు 69)